క్లుప్తంగా

23న ఉపాధి గ్రామసభలు

వరికుంటపాడు: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 23న ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ అజామ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించే గ్రామసభల్లో పంచాయతీల్లో అవసరమైన పనులను గుర్తించి తీర్మానాలు రూపొందించనున్నట్లు వివరించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

వరికుంటపాడు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలను వేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. మండలంలోని వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లె పశువైద్యశాలల పరిధిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పెద్దిరెడ్డిపల్లెలో టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించుకోవాలని రైతులకు సూచించారు.

ఆర్టీఓ తనిఖీలు



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో ఆర్టీఓ బీ గోపినాయక్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మూడు వాహనాలకు లైసెన్సులు, రెండు వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడం గుర్తించి సీజ్ చేశారు. రోడ్లపై తిరిగే వాహనాలకు సరైన పత్రాలు ఉండాలన్నారు. స్కూల్ బస్సులకు పర్మిట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సాంబశివ ట్రస్ట్ వితరణ



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టు కూలీ నిమిత్తం శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్టు రూ.43,200 నగదును మంగళవారం వితరణ చేసింది. గిరిజన విద్యార్థులు యూనిఫామ్ కుట్టించుకోలేని స్థితిలో ఉన్నారని ఉపాధ్యాయులు ట్రస్టు నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి దృష్టికి తీసుకు రావడంతో స్పందించి నగదు అందజేశారు. ఎంఈఓ చలపతి, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తమాలజిస్ట్ సందీప్ విద్యార్థులకు కంటి సమస్యలు..వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్న వయసులోనే కంటి చూపులో మార్పులు వస్తున్నాయని, ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు కళ్లను కాపాడుకోవడం బాధ్యతగా భావించాలన్నారు. అందుకే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

బీఎల్వోల సమావేశం

సీతారామపురం: మండలంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 సర్వేను బీఎల్వోలు పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బీఎల్వోలతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 18 వరకు కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపులు, ఓటర్ల సవరణలు చేపట్టాలని సూచించారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా, 2025 జనవరి 6 నాటికి ఓటర్ల తుదిజాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

మర్రిపాడు: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు తమ పంచాయతీల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ ఖాదర్‌మస్తాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ, ట్రాన్స్‌కో ఏఈ రామచంద్రయ్య, హౌసింగ్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

శుభ్‌దిన్ భోజనం

మర్రిపాడు: రాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో శుభ్‌దిన్ భోజన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన దొమ్మరాజు అనురాధ దాతృత్వంతో విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

పడకేసిన పల్లె వైద్యం



సోమవారం చాకలికొండ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుడు కుర్చీ



ఉదయగిరి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు వైద్యసిబ్బందిని భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామీణులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించింది. అందుకనుగుణంగా గత ఐదేళ్లలో ప్రజారోగ్యం తమ బాధ్యతగా ఆరోగ్య సిబ్బంది ప్రతి ఊరు, ప్రతి గడపకు వెళ్లి వైద్య సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె వైద్యం పడకేసింది. పల్లెల్లో ఎవరికి ఎలాంటి జబ్బు చేసినా పలకరించే దిక్కులేదు. జ్వరం వస్తే మంచానికే పరిమితం కావాలి. డయేరియా వంటి వ్యాధులను కూడా నయం చేసే పరిస్థితి లేదు. ప్రజారోగ్యం గాలిలో దీపం చందంగా మారింది.

కనిపించని ఫ్యామిలీ డాక్టర్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎంతో ముందు చూపుతో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను నియమించింది. వారిలో ఒకరు ఆస్పత్రిలో, మరొకరు 104 వాహనంలో ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించేవారు. ఆ విధానాన్ని కొత్త ప్రభుత్వం నేడు పూర్తిగా ఎత్తేసింది. ఇప్పుడు వైద్యులు పల్లెలకు వచ్చే పరిస్థితి లేదు. పల్లెకు, వైద్యులకు ఉన్న సంబంధం పూర్తిగా తెగిపోయింది. గతంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పల్లెల్లో తిరిగేవారు. నేడు వారు ఎక్కడ ఉన్నారో కూడా తెలియని పరిస్థితి. డయేరియా, జ్వరాలు విజృంభిస్తున్నా పట్టించుకునే వారే లేరు.

వ్యాధులను గుర్తించేదెవరు?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెల్లో అసాంక్రమిక వ్యాధులకు క్రమం తప్పకుండా నిర్ధారణ పరీక్షలు చేస్తూ మందులు ఇచ్చేవారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులను అరికట్టేందుకు గతంలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు కరువయ్యాయి. గతంలో 104 వాహనాలు నిర్ణీత కాల వ్యవధిలో గ్రామాలకు వెళ్లి మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించి అవసరమైన మందులు ఇచ్చేవి. నేడు ఆ వాహనాలు పల్లెలో కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

విధులకు వైద్య సిబ్బంది డుమ్మా

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో మారుమూల పల్లెల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది తరుచూ విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు రోజుల తరబడి ఆస్పత్రులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వింజమూరు మండలం చాకలికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వారం రోజుల నుంచి వైద్యులు రావడం లేదని రోగులు తెలిపారు. చాకలికొండ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. అందులో ఒకరు రెగ్యులర్ కాగా, మరొకరు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఇన్‌చార్జి డాక్టర్ కలిగిరి పీహెచ్‌సీలో మూడ్రోజులు, చాకలికొండ పీహెచ్‌సీలో మూడ్రోజులు పనిచేయాలి. కానీ ఆయన ఇక్కడకు అసలు రావడం లేదు. ఆస్పత్రిలో ముగ్గురు నర్సులు ఉన్నా సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. మరో వైద్యుడు ఇతర అధికారిక కార్యక్రమాల నిమిత్తం క్యాంపునకు వెళితే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జి డాక్టర్, సిబ్బంది విధులకు రాకపోవడంపై రెగ్యులర్ వైద్యుడ్ని అడిగితే తన మాట వారు వినడం లేదని చెబుతుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో తనను ఇక్కడి నుంచి వేరే చోటుకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు సైతం విజ్ఞప్తి చేసినట్లు రెగ్యులర్ వైద్యుడు చెబుతున్నాడు. దుత్తలూరు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు మెటర్నిటీ లీవుపై వెళ్లారు. మరో డాక్టర్ సమయపాలన పాటించడం లేదు. ఆస్పత్రికి ఎప్పుడు వస్తారో..ఎప్పుడు పోతారో కూడా తెలియడం లేదు. కొన్ని మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కొంత మంది వైద్యులు, సిబ్బంది సమయాన్ని పాటించడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు, సిబ్బంది నడుమ సమన్వయం ఉండడం లేదు. కొంతమంది సిబ్బంది వైద్యుల మాటను లెక్క చేయకుండా విధులకు ఎగనామం పెడుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలోని ఆస్పత్రులు	
పీహెచ్‌సీలు-10	సీహెచ్‌సీలు -2



ఉదయగిరిలో అధ్వానంగా పారిశుధ్యం

వైద్యులు ఉండడం లేదు



గత ప్రభుత్వంలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు. డాక్టర్లు రెండుసార్లు ఇంటికి వచ్చి చూసేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక వైద్యసిబ్బంది, డాక్టర్లు ఎవరూ రావడం లేదు. చాకలికొండ వైద్యశాలకు వచ్చిన ఇక్కడ డాక్టర్లు లేరు. దీంతో విధిలేక వింజమూరుకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాం.

–లక్ష్మయ్య

నెలాఖరులోగా సభ్యత్వాలను పునరుద్ధరించుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

దుత్తలూరు: సొసైటీల పరిధిలోని రైతులు నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకుని తమ సభ్యత్వాలను పునరుద్ధరించుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ ఎస్ శ్రీనివాసరావు సూచించారు. కమ్మవారిపాళెం సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి త్వరితగతిన కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. రూ.300 షేరు కలిగిన సభ్యులు ఈకేవైసీ పత్రాలు సమర్పించి తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలన్నారు. అలా చేయని సభ్యులను సంఘ సభ్యత్వం నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఈకేవైసీ కోసం రైతులు ఆధార్ జిరాక్స్, పొలం పట్టాదారు పాస్‌పుస్తకం లేదా 1బీ జిరాక్స్, నామినీ పేరు, ఫోన్ నంబర్, రెండు ఫొటోలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. వాయిదా మీరిన బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయగిరి బ్రాంచ్ సూపర్‌వైజర్ టీ రాజశేఖర్, సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారం అమానుషం



సంగంలో నిరసన ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు



ఉదయగిరిలో ..

సంగం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సంగంలో జనసేన ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులతో కలిసి జనసేన నాయకులు హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

ఉదయగిరి: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం కోసం నిత్యం శ్రమించే వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోజ్‌దార్ మన్సూర్, కాకు వెంకటయ్య, షేక్ ఎండీ ఖాజా, బకీర్‌జాషువా, మన్సూర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కౌన్సెలింగ్ అడ్డగింత

ఉదయగిరి: ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఉదయగిరిలో ప్యాప్టో నాయకులు అడ్డుకున్నారు. ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా అడ్డుకుని తమ సమస్యలపై ఎంఈఓలు మస్తాన్‌వలి, శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు విధానంలో ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పులు సవరించుటకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వాటిని సరిచేసిన తర్వాతే కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరామన్నారు. గ్రీవెన్స్‌ను సరిచేయని కారణంగా అధికారుల విధానాన్ని నిరసిస్తూ కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నట్లు తెలిపారు. ప్యాప్టో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ మహ్మద్‌ఖాజా, ఫణిరాజు, షబ్బీర్, బలరామ్ పాల్గొన్నారు.

అందుబాటులో లేని సెబ్ సీఐ

–గ్రామాల్లో ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు

ఆత్మకూరు: నియోజకవర్గంలో ఇసుక, మద్యం అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకొని కేసులు నమోదు చేయాల్సిన సెబ్ విభాగం నిద్రపోతోందేమోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆత్మకూరుకు వచ్చారు. ఆయన ఉద్యోగుల సంఘ యూనియన్ కార్యవర్గ సభ్యుడు. దీంతో ఎక్కువ సమయం విజయవాడలోనే ఉంటూ ఆత్మకూరులో అందుబాటులో ఉండడం లేదని పలువురు అంటున్నారు. సెబ్ ఎస్సై కిరణ్ మొత్తం వ్యవహారాలను చక్క దిద్దుతున్నారు. దీంతో పలు మండలాల్లో యథేచ్ఛగా ఇసుక, మద్యం అక్రమ రవాణా, విక్రయాలు సాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో బెల్టు దుకాణాలు ఐదుకి మించి ఉన్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది. సెబ్ కార్యాలయంలో సీఐ, ఎస్సైలతో కలిపి 8 మంది సిబ్బంది ఉండాలి. మంగళవారం పరిశీలిస్తే కంప్యూటర్ ఆపరేటర్, ఓ కానిస్టేబుల్ మాత్రమే కార్యాలయంలో ఉన్నారు. ఈ విషయమై జిల్లా సెబ్ ఈఎస్ బాబు శ్రీధర్‌ను సంప్రదించగా ఆత్మకూరు సెబ్ సీఐ రవీంద్ర నెల రోజులు సెలవు పెట్టారని, ఏదైనా పని ఉంటే తనతో చెప్పాలన్నారు. సీఐ గుంటూరులో ఉన్నారంట కదా అని అడిగితే అవునని పేర్కొన్నారు.

30న భగవద్గీత శ్లోకాలపై పోటీలు

దుత్తలూరు: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంతం, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30న భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నట్లు త్రైత సిద్ధాంత దుత్తలూరు మండల కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం వారు పోటీలపై అవగాహన కల్పించారు. భగవద్గీత శ్లోక పుస్తకాలను అందజేశారు. దుత్తలూరు సెంటర్‌లో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.2 వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000 చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

చేజర్ల: సంగం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డిని చేజర్ల మండల బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కుంకు బాలయ్యనాయుడు, మండల నాయకులు కోటిరెడ్డి ఉన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు

అల్లూరు: స్థానిక బీసీ కాలనీలోని ఆర్‌బి రోడ్డులో ఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని విశేష పుష్పాలంకరణ, నాద స్వరకచ్చేరి, సహస్రనామార్చన, ఖడ్గమాల పూజలను నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ గంగపెట్టి ప్రదక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమలతో విషజ్వరాలు వ్యాప్తి

కావలి: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నలంద పాఠశాల విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, దోమలను పారదోలడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందుదామంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎండీ వసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు సరుడు అపహరణపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: దుకాణంలో ఉన్న మహిళ మెడలోని బంగారు సరుడును బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..రాజవోలు గ్రామానికి చెందిన కరేటి పెంచలమ్మ చిన్నపాటి దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం రాత్రి దుకాణం వద్దకు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి సిగరెట్లు అడిగారు. ఆమె దుకాణంలోని సిగరెట్లు తీసుకుని బయటకు రాగానే మెడలో ఉన్న బంగారు సరుడును లాక్కుని బైక్‌పై పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారు సరుడు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎస్సై ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈఓకు సన్మానం



సోమశిల: అనంతసాగరం మండల ఎంఈఓ జానకీరామ్‌ను వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, ఎస్ డానియేల్ మంగళవారం ఘనంగా సన్మానించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంపై అభినందనలు తెలిపారు. ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

రూ.21లక్షల ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం



జలదంకిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కలిగిరి: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ. 21 లక్షలు మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ప్రిసైడింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం రాత్రి వరకు జరిగింది. 23 పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై ప్రిసైడింగ్ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 23 పంచాయతీల్లో 1216 పనులకు రూ. 14.85 కోట్లు ఖర్చు చేసినట్లు ఆమె తెలిపారు. మస్టర్లు, కొలతల్లో తేడాలకు సంబంధించి ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ. 21 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. కృష్ణారెడ్డిపాళెం రూ.3.75 లక్షలు, పెద్దకొండూరు రూ.3.39 లక్షలు, చిన్నఅన్నలూరు రూ.1.73 లక్షలు, నాగసముద్రం రూ.1.38 లక్షలు, కలిగిరి రూ.1.32 లక్షలు, ఎరుకలరెడ్డిపాళెం రూ.1.24 లక్షలు, క్రాకుటూరు రూ.1.01 లక్షలు, కావలిముస్తాపురం రూ.92వేలు, పోలంపాడు రూ.80వేలు, వెలగపాడు రూ.80 వేలు, పడమరగుడ్లదొన రూ.64 వేలు, గంగిరెడ్డిపాళెం రూ.52వేలు, కుమ్మరకొండూరు రూ.47 వేలు, సిద్ధనకొండూరు రూ.44 వేలు, తెల్లపాడు రూ.42వేలు, పరికోట రూ.36 వేలు, లక్ష్మీపురం రూ.33 వేలు, అనంతపురం రూ.32, వీర్నకొల్లు రూ.31 వేలు, తూర్పుదూబగుంట రూ.30 వేలు, తూర్పుగుడ్లదొన రూ.24 వేలు, రావులకొల్లు రూ.22 వేలు, ఏపినాపి రూ.10వేలు చొప్పున రికవరీకి ఆదేశించినట్లు వివరించారు.

జలదంకిలో రూ. 5.71 లక్షలు..

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 17 పంచాయతీల్లో 1035 పనులను రూ.10.68 కోట్లతో చేపట్టారు. ఈ పనులను పరిశీలించి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ అధికారి వెంకటరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి కొందరు లబ్ధిదారులకు డబుల్ పేమెంట్లు చేయడం, మస్టర్లు, కొలతలు, ఎంబుక్‌ల నమోదులో అవకతవకలు జరిగినట్లు గుర్తించి రూ. 5.71 లక్షల రికవరీకి ఆదేశించారు. పంచాయతీరాజ్ సీసీరోడ్లకు సంబంధించిన చేపట్టిన పనుల కంటే రికార్డుల్లో ఎక్కువగా నమోదు చేయడం గమనించి రూ. 5.4 లక్షలకు రికార్డులు చూపించాలని ఆ శాఖ ఏఈని ఆదేశించారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించి రూ. 1.91 లక్షలు, ఇరిగేషన్ పనులకు సంబంధించి రూ. 12. 62 లక్షలకు రికార్డులు చూపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమ్మవారిపాళెం పంచాయతీలో మస్టర్లు సక్రమంగా లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ మౌనికను సస్పెండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌రిసోర్స్ పర్సన్ నీలకంఠ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ శ్యామల, పీఆర్ ఏఈ వాణి, టీఏలు, పీఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని ఆందోళన




రోడ్డుపై బైటాయించిన విద్యార్థులు

సీతారామపురం: అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పబ్బులేటిపల్లి వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై విద్యార్థులు మంగళవారం బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజీపేట–సీతారామపురం మార్గంలో విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఉదయగిరి డిపో యాజమాన్యం ఒకే ఒక్క బస్సు సర్వీసును ఏర్పాటు చేసిందని తెలిపారు. అందులో ప్రయాణికులను సైతం ఎక్కించుకుంటుండంతో సీట్లు లేక నిలబడి, ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫుట్‌పాత్‌పై వేలాడుతూ జారిపడి కళ్యాణ్ అనే విద్యార్థి గాయాలపాలయ్యాడని తెలిపారు. అయినా ఉదయగిరి డిపో యాజమాన్యం స్పందించలేదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రెండు సర్వీసులు నడపాలని కోరారు.


బెదిరించి నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

కొండాపురం: తాము సొంత పట్టా పొలాల్లో నుంచి నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లకు మట్టి తోలుకుంటుంటే తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసుల పేరుతో తమను బెదిరించి నగదు వసూలు చేస్తున్నాడని మర్రిగుంట గ్రామస్తులు కొండాపురం పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 18,19 తేదీల్లో ఇళ్లకు మట్టి తోలుకుంటుండగా పదిహేను ట్రాక్టర్ల యజమానులను గ్రామానికి చెందిన కొరివి ఓబులు రూ.500 చొప్పన ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. కొండాపురం పోలీసులకు నగదు ఇస్తే వారు ఇటు పక్కకు రారని, మీరు సజావుగా మట్టి తోలుకోవచ్చని తెలపడంతో రెండ్రోజుల పాటు నగదు అందజేమని చెప్పారు. మంగళవారం కూడా నగదు డిమాండ్ చేశాడని, సాయంత్రం ఇస్తామని చెప్పగా కొండాపురం పోలీసులను పిలిపించి తమ ట్రాక్టర్లను పట్టిచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై కొండాపురం ఎస్సై మహేంద్రను వివరణ కోరగా ట్రాక్టర్ యజమానులను పిలిపించి విచారిస్తున్నామని తెలిపారు.

రోనాల్డ్‌రాస్‌కు నివాళి



సీతారామపురం: రొనాల్డ్‌రాస్‌కు నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది



వరికుంటపాడు పీహెచ్‌సీలో..

వరికుంటపాడు/సీతారామపురం: వరికుంటపాడు, సీతారామపురం పీహెచ్‌సీల్లో ప్రపంచ దోమల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. రోనాల్డ్ రాస్ చిత్రపటానికి వైద్యాధికారిణులు ఆయేషా, స్వప్నారెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోనాల్డ్ రాస్ సికింద్రాబాద్‌లో పనిచేస్తూ 1897 ఆగస్టు 20న ఆడ ఎనాఫిలాస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కనుగొన్నారని తెలిపారు. ఆయన చేసిన పరిశోధనలకు 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి దక్కిందన్నారు. ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ ఏటా ప్రపంచ దోమల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.